www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం 23 మార్చి 2024



పెంచలకోనలో 'చంద్రబాబు'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాకు వచ్చారు.మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో రాపూరు మండలం గోనుపల్లికి వచ్చారు. ఆయన అక్కడ నుండి పెంచలకోనకు వెళ్లారు. పెనుశిల నరసింహస్వామిని సందర్శించు కున్నారు. ఆయనను చూడడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలొచ్చారు. ఆయనకు దేవాలయ సిబ్బంది, పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించాలని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజల కోసం పోరాడే శక్తిని, పనిచేసే సామర్థ్యాన్ని ఇవ్వాలని స్వామిని వేడుకున్నారు. ప్రజలకు రాబోయే రోజుల్లో మంచి జరగాలని స్వామిని ప్రార్థించానని తెలిపారు. అనంతరం హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికి. వీడ్కోలు పలికారు.


చంద్రబాబును ఆశీర్వదిస్తున్న దృశ్యం

అలుపెరుగని పోరాట యోధుడు 'అప్పారి'

ప్రజాశక్తి-నెల్లూరు :ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో అలుపెరుగని పోరాటం చేసిన ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు అప్పారి వెంకటస్వామి అని మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు వి.వి. శేషులు అధ్యక్షతన అప్పారి వెంకట స్వామి 23వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలోనూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోను ఆనాటి ప్రభుత్వాల నిరంకుశ విధానాలను ఎండగట్టడానికి చారిత్రాత్మక అవసరంగా యుటిఎఫ్ ఆవిర్భావం జరిగిందని తెలిపారు. ఆవిర్భావ ప్రధాన కార్యదర్శిగా సంఘ నిర్మాణంలోనూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోను, విద్యారంగ పరిరక్షణలోనూ, రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతూ 25 సంవత్సరాల పైబడి సంఘానికి తన జీవితాన్ని సమర్పించిన మహోన్నత వ్యక్తి అన్నారు. సంఘం కోసం తన ఉద్యోగ జీవితాన్ని సైతం తణప్రాయంగా వదిలివేసిన త్యాగధనుడు అప్పారి వెంకటస్వామి అని వారు కొనియాడారు. ఆయన ముందు చూపు, దార్శనికత, సంఘం పట్ల నిబద్ధత, అవినీతిపై రాజీలేని పోరాటాలు, ఉద్యమ స్ఫూర్తి అనేక సమస్యలకు పరిష్కారాలయ్యాని తెలిపారు. ఆయన చూపిన ఆదర్శ మార్గంలో సమాజ అభివృద్ధికి విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిం చాల్సి ఉందని తెలిపారు. కార్యక్ర మంలో యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబు రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతి శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వి.రమాదేవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.సి. అచ్చయ్య, జిల్లా కోశాధికారి ఎ.మురళీధర్ రావు, జిల్లా కార్య దర్శులు ఎస్‌కె. ఖాజావలి, ఎన్. సురేంద్ర బాబు, జి.దయాకర్, కె.శ్రావణ్ కుమార్, కె.భారతి, ఎన్. మధుసూదన్ రావు, ప్రాంతీయ మండలాల అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్

చెక్ పోస్టులు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలోనగదు అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు నిర్వహించి తనిఖీలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నగదు రవాణా జరగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు చేపట్టే ముందు తప్పనిసరిగా ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని తెలియజేశారు. రాజకీయ పార్టీలు డోర్ టు డోర్ క్యాంపెయిన్లు నిర్వహించే ముందు ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు సంబంధించి ఘర్షణలు వంటివి జరిగినప్పుడు అధికారులు వెంటనే స్పందించాలన్నారు. సంబంధిత సంఘటనలకు సంబంధించిన నివేదికను కూడా ఎన్నికల సంఘానికి తెలియజేయాలన్నారు.రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఓట్ల తొలగింపులు, మార్పుల కోసం వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సందర్భంగా నగదు అక్రమ రమణా జరగకుండా తనిఖీలు చేపట్టడానికి 18 ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

'సోమిరెడ్డి' నిరీక్షణ ఫలించింది..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

:సీనియర్ రాజకీయనేత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఎట్టకేలకు సర్వేపల్లి ఎంఎల్ఎ టికెట్‌ను టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆయన టికెట్ ప్రకటించిన వెంటనే నెల్లూరు నగరంలోని ఆయన నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. సర్వేపల్లి నియోజకవర్గ వ్యాపితంగా ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. చివరికి తన కుటుంబం నుండి ఆయన కోడలు శృతి పేరును పరిశీలించారు. ఆమెకు టికెట్ ఇస్తున్నామని అధిష్టానం ప్రకటించింది. తనకు నియోజక వర్గంలో సానుభూతి ఉందని, టికెట్ ఇస్తే గెలుస్తానని పదే పదే విజ్ఞప్తి చేయడంతోపాటు, అవకాశం కల్పించాలని ప్రాదేయపడ్డారు. ఒక సీనియర్ నేత టికెట్ కోసం ఇలా చేయడం ఆపార్టీలోని అనేకమంది నేతలకు అసంతృప్తి కలిగించింది. ఎందరికో టికెట్స్‌కు సిఫార్సు చేయన ఆయన తన టికెట్ కోసం నిరీక్షించాల్సిన వచ్చింది. టికెట్ ప్రకటించడంతో ఆయన నివాసంలో సంబరాలు చేసుకున్నారు. ఆయన కుమారుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని పలువురు కార్యకర్తలు కలిసి అభినందించారు. సోమిరెడ్డికి కలుసుకొని పూలమాల వేసి, ఘనంగా సత్కరించారు. ఎన్నికల్లో సర్వేపల్లిలో గెలిచి తీరుతానని ఆయన ప్రకటించారు. తనకు టికెట్ ఇచ్చిన చంద్రబాబునాయుడు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాణసంచ కాలుస్తున్న దృశ్యం

నిజాయతీగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ఓటు హక్కును నిజాయతీగా వినియోగించు కోవాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ యువతకు పిలుపునిచ్చారు. స్థానిక నెల్లూరు నగరంలోని ఎంజి మాల్ లో ఓటు హక్కు వినియోగం పై సెల్ఫీ పాయింట్ ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు హక్కు పై అవగాహన కల్పించడానికి స్వీప్ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. సెల్ఫీ పాయింట్ సెల్ఫీ పాయింట్ మే11వ తేదీ వరకు ఉంటుందని తెలియజేశారు. ఈఅవకాశాన్ని నగరంలోని ప్రజలందరూ వినియోగించు కోవాలని తెలియజేశారు. జిల్లాలో మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు.జిల్లాలో 18 సంవత్సరాల నుంచి 21 సంవత్సరం వయస్సు గల యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. జిల్లాలో యువతీ యువకులు ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. యువతీ యువకులు సెల్ఫీ పాయింట్లు వద్ద సెల్ఫీ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ .పి.తిరుమలేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మరమ్మత్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. లవన్న, సిపిఓ ఎస్. రాజు,జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, నుడా వైస్ చైర్మన్ టి. బాపిరెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాణి మందా, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, డి.ఆర్. డి. ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ, రెవెన్యూ డివిజనల్ అధికారి మలోల, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలందరూ పనిచేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టీడీపీ-జనసేన- బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం జనసేన నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు, నెల్లూరు పార్లమెంట్ ఎంపి అభ్యర్థి శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా టీడీపీ-జనసేన-బిజెపి ఉమ్మడి అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి ఏర్పడటంతోనే గెలుపు ఖాయమైందన్నారు. ఇది విజయవంతమైన కూటమి అని, ఈ ఎన్నికల్లో కూడా తప్పకుండా గెలుపు దక్కుతుందన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకార్ల సురేష్, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, రూప్ కుమార్ యాదవ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-లింగసముద్రం: రాబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజాశాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యల్లో భాగంగా గుడ్లూరు సిఐ బివివి.సుబ్బారావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. గుడ్లూరు సర్కిల్ పోలీస్ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని చిన్న పావని, ముత్యాలపాడు, పెద్ద పావని గ్రామాలలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు.

కృష్ణపట్నం పోర్టుకు అరుదైన పురస్కారం

ప్రజాశక్తి-నెల్లూరు: అదాని కృష్ణపట్నం పోర్టులో పర్యావరణ పరిరక్షణ కాలుష్య నియంత్రణకు ఆరోగ్యం, భద్రత, వంటి రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి ప్రతిష్టాత్మకమైన 2023 అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ ప్లాటినం అవార్డును శుక్రవారం అపెక్స్ గ్రీన్ ఇండియా ఫౌండేషన్ న్యూ ఢిల్లీలో ప్రకటించారు. ఈ అవార్డు రావడంపై అదాని కృష్ణపట్నంపోర్ట్ సీఈఓ జిజెరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని కృష్ణపట్నం పోర్ట్‌లో ముఖ్యంగా చేపడుతున్న మొక్కల పెంపకం, ఆరోగ్య పరిరక్షణ, భద్రత, పై అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడంతో పాటు కాలుష్యనివారణకు ప్రతేక చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులు,కార్మికుల నైపుణ్యాభివృద్ధికి అదాని కృష్ణపట్నం పోర్టు కృషి చేస్తుందన్నారు."అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ అవార్డ్ 2023"కు ఆయా రంగాలలో ఆదర్శప్రాయమైన విజయాలను గుర్తించి సంస్థలకు ప్లాటినం, అవార్డును ఫౌండేషన్‌కు పోర్టును ఎంపిక చేసిందన్నారు. అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ అవార్డ్ 2023" పర్యావరణ పరిరక్షణను మెరుగుపరచడానికి, మనం పని చేసే ప్రాంతం, నివసించే ప్రాంతాల్లో పర్యావరణ ప్రయోజనాల కోసం దీర్ఘకాలిక మార్పులను సృష్టించేందుకు బాధ్యతాయుతమైన వినూత్న కార్యక్రమాలు అభ్యాసాలకు గుర్తింపుగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్లాటినం అవార్డు ప్రకటించడంతో మరింతగా పర్యావరణ, పరిరక్షణ, ఆరోగ్య, భద్రత కృషి చేస్తామన్నారు.

శివరామకృష్ణ కుటుంబానికి మద్దతు

ప్రజాశక్తి-కందుకూరు: దొంగలు బీభత్సం సష్టించి భయభ్రాంతులను చేసిన కలమర్లపూడి శివరామకృష్ణ కుటుంబానికి కందుకూరు మండల ఆర్యవైశ్య సంఘం అండగా నిలిచింది. కందుకూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వందలాదిమంది ఆర్యవైశ్యులు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నుంచి పట్టణంలోని డిఎస్‌పి ఆఫీస్ వద్దకు చేరుకుని కందుకూరు డిఎస్‌పి ఏ శ్రీనివాస్ ను కలిసి కనుమలపూడి శివరామకృష్ణ ఇంట్లో దొంగతనం చేసి, బీభత్సం సష్టించి, మరలా శుక్రవారం ఉదయం 9 గంటలకు ఇంటికి వచ్చి కత్తి చూపించి భయభ్రాంతులను చేసి 15 లక్షలు ఇమ్మని లేకుంటే చంపుతామని బెదిరించారు. మోటార్ సైకిల్ పై పరారైన దొంగలను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డీఎస్పీకి మండల ఆర్యవైశ్య సంఘం తరపున నగర ఆర్యవైశ్యులందరూ సంతకాలు చేసి డీఎస్పీకి అందజేశారు. డి.ఎస్.పి మాట్లాడుతూ దొంగలను రెండు మూడు రోజుల్లోనే పట్టుకుంటామని, బాధితుల ఇంటి వద్ద ఇద్దరు పోలీసులను కాపలాగా ఉంచుతామని తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అసత్య ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి-కందుకూరు: వైజాగ్ పోర్ట్ లో సిబిఐకి దొరికిన దాదాపు రూ.50 లక్షల విలువైన డ్రగ్స్ వెనక రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ఎంపి విజయ సాయి రెడ్డి హస్తం ఉందని, అడ్డంగా దొరికిపోయామనే బయం తోనే టిడిపి నేతల పై వైసిపి సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ అన్నారు. ఇంటర్పోల్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు సిబిఐ అధికారులు తనికీ చేస్తుంటే డ్రగ్స్ ఉన్న కంటైనర్ తనిఖీ చేయకుండా కొందరు రాష్ట్ర ఉన్నాతాధికారులు అడ్డుపడ్డారని సీబీఐ తన నివేదికలో పేర్కొందన్నారు. మత్తు పదార్థాలున్న కంటైనర్‌ని తనిఖీ చేస్తుంటే రాష్ట్ర అధికారులు అడ్డు పడాల్సిన అవసరం ఏంటనీ, దీని వెనక ఉన్న పెద్దలు ఎవరో బయటకు తీయాలని, రాష్ట్ర రాజధాని చేస్తామంటూ సిటీ ఆఫ్ డెస్టినీ నీ కాస్త సిటీ ఆఫ్ డ్రగ్ గా వైకాపా నేతలు చేశారని, విశాఖ ను పరిపాలన రాజధానిగా కాదు డ్రగ్స్ రాజధానిగా చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందన్నారు. డ్రగ్స్ మాఫియా వెనక ఉన్న విజయ సాయి రెడ్డి నెల్లూరు పార్లమెంట్ కు వైసిపి నుంచి పోటీ చేస్తున్న నేపథ్యం లో ప్రజలు ఓడించి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

టిఆర్ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు
రాష్ట్రంలోనే న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి-కందుకూరు: బెంగుళూరులోని న్యాక్ కార్యాలయం విడుదల చేసిన ఫలితాల్లో కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏప్లస్ నాక్ గ్రేడును కైవసం చేసుకుంది. ఫిబ్రవరి 14,15వ తేదీల్లో కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం కళాశాలలో అమలవుతున్న బోధనా పద్ధతులను, పరిశోధన సామర్థ్యాన్ని, మౌలిక వసతులను, విద్యార్థుల క్రీడా, సాంస్కృతిక , విద్యాపరమైన సామర్థ్యాలను, కళాశాల పరిపాలనను, విద్యార్థులను ఉద్యోగాలకు, సమాజానికి దగ్గరగా తీసుకోవడంలో కళాశాల చూపుతున్న చొరవను పరిశీలించి కళాశాలకు ఏప్లస్ గ్రేడ్ ఇవ్వడం జరిగింది. వాస్తవానికి న్యాక్ బృందం గత సంవత్సరం మేలో కళాశాలను సందర్శించి బి+ గ్రేడును కేటాయించింది. చేసిన కృషికి సరైన ఫలితం లభించకపోవడంతో కళాశాల విద్యా శాఖ కమిషనర్ ప్రోత్సాహంతో ప్రిన్సిపల్ డాక్టర్.ఎం.రవికుమార్ గ్రేడ్ పునఃపరిశీలనకై న్యాక్ ప్రధాన కేంద్రానికి అప్పీలు చేశారు. ఈ విధంగా రాష్ట్రంలోనే న్యాక్ బృంద పునఃపరిశీలనకు అప్పీలు చేసిన మొట్టమొదటి కళాశాలగా కందుకూరు కళాశాల నిలిచింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎం.రవికుమార్ ఈ విజయానికి కషి చేసిన ఐక్యుఏసి విభాగాధిపతి డాక్టర్ పి. రాజగోపాల్ బాబుని, విద్యార్థినీ విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని, అధ్యాపకేతర సిబ్బందిని, పూర్వ విద్యార్థులను దాతలను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల మౌలిక వసతుల అభివృద్ధికి కోటి రూపాయలతో దాతల సహకారాన్ని అందించిన కందుకూరు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డికి ప్రిన్సిపల్ రవి కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ విజయానికి సహకరించిన కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, డాక్టర్.తులసి, అధికారులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

-కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ రవి కుమార్

'ప్రకాశం'లో ధ్యానం క్లాసులు

ప్రజాశక్తి-కందుకూరు: ధ్యానం మానసిక ఉల్లాసానికి మూలాధారమని ప్రముఖ ధ్యానం మాస్టారు సాయిరామ్ పేర్కొన్నారు. శుక్రవారం ఓపెన్ ఆడిటోరియంలో ఫస్ట్ ఇయర్ బి.టెక్, డిప్లమో విద్యార్థులతో ఆయన ధ్యాన అభ్యాసం చేయించారు. 20 నిమిషాల పాటు విద్యార్థులు ఏకాగ్రతతో చేసిన ధ్యానం మైండ్ ను బలోపేతం చేస్తుందని వెల్లడించారు. చెడు ఆలోచనలకు దూరంగా ఉంచే శక్తి ధ్యానానికి ఉంటుందన్నారు. మెజారిటీ విద్యార్థులు సానుకూలంగా స్పందిస్తూ వారానికి ఒకరోజు ఇటువంటి క్లాసులు నిర్వహించాలని అభ్యర్థించారు. వార్డెన్ ఒ.రజని కార్యక్రమాన్ని నిర్వహించారు.

విజయసాయిరెడ్డికి 'బుర్రా' స్వాగతం

ప్రజాశక్తి-కందుకూరు: నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వి. విజయ సాయి రెడ్డి కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధరరెడ్డిని మర్యాద పూర్వకం కలవడానికి మాచవరం విచ్చేశారు. ఈసందర్భంగా కందుకూరు నియోజకవర్గం వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువను బహూకరించి స్వాగతం పలికారు.


పుష్ప గుచ్ఛం అందజేస్తున్న బుర్రా

అంగన్‌వాడీలకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ఉలవపాడు: అంగన్‌వాడీలకు రెండు నెలలుగా పెండింగ్‌లోని వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, మధ్యాహ్నం వరకు క్లాసులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇప్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సిడిపిఒ కార్యాలయంలో శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ మణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, జి.వి.బి కుమార్, సి.హెచ్ ఇందిరావతి, వాక లతారెడ్డి, గీత, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'బుర్రా'కు పలువురు మద్దతు

ప్రజాశక్తి-కందుకూరు: వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు కందుకూరు నియోజక వర్గం ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాల యం వద్ద ఉలవపాడు 1 ఎంపిటిసి షేక్ ఫైజా నిషా, ఉలవపాడు 3 ఎంపిటిసి వాకా.రాధా మాధవి కలిసి తమ పూర్తి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. మహిళలకు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ ప్రజలకు సామాజిక న్యాయ దృక్పథంతో అవకాశాలు కల్పించారు.

మహీధర్‌రెడ్డితో విజయసాయిరెడ్డి భేటి

ప్రజాశక్తి-కందుకూరు: వైసిపి శాసనసభ్యుడు మానుగుంట మహీధర్ రెడ్డికి ఆ పార్టీ కందుకూరు సమన్వయకర్త బుర్ర మధుసూదన్ యాదవ్ మధ్య సయాధ్య కుదిరినట్లు తెలుస్తుంది. పార్టీ ప్రధాన కార్యదర్శి ,నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి తో కలిసి శుక్రవారం సాయంత్రం మాచవరం వెళ్లి మహీధర్ రెడ్డిని కలిశారు. ముగ్గురు మధ్య గంట సేపు చర్చలు జరిగాయి.


మాట్లాడుతున్న మంత్రి కాకాణి

అధికారులను విమర్శించడం సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాజకీయంగా పరిణితి చెందిన సోమిరెడ్డి ..జిల్లా అధికారులపై తీవ్ర విమర్శలు చేయడం సరికాదని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైదాపురంలో అక్రమ గనుల తవ్వకాల పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నా రన్నారు. దమ్ముంటే సి.బి.ఐ. విచారణ కోరాలన్నారు.అక్రమ మైనింగ్ పై విచారణ జరపాలని తానే ప్రభుత్వానికి లేఖ రాశానన్నారు. పొదలకూరు లో రూ.500.కోట్ల విలువైన తెల్లరాయిని తవ్వి స్టాక్ చేశారని సోమిరెడ్డి ఆరోపించారన్నారు. రూ.5 కోట్లు ఆయన చెల్లిస్తే..ఆ స్టాక్ ఇచ్చేలా ప్రభుత్వం...ఎన్నికల సంఘాన్ని కోరుతానన్నారు. దీనికి సోమిరెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. సోమిరెడ్డికి టికెట్ ఇవ్వడం సంతోషం మన్నారు. వరుసగా నాలుగు సార్లు ఓడిపోయిన ఆయన మరో సారి ఓటమికి సిద్ధమవుతున్నారన్నారు.

పోలింగ్ కేంద్రాలకు
విద్యుత్ సరఫరా తప్పనిసరి

ప్రజాశక్తి-నెల్లూరు

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాలన్నింటికీ తప్పనిసరిగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ వి.విజయన్ పేర్కొన్నారు. శుక్రవారం విద్యుత్ భవన్‌లో ఆయన జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ఇ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు, కలెక్టర్ ఆదేశాల అనుసారం ఉమ్మడి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలన్నింటినీ ఇప్పటికే తనిఖీ చేశామన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని గూడూరు డివిజన్లో 434, కావలి డివిజన్లో 416, కోవూరు డివిజన్లో 386, నాయుడుపేట డివిజన్లో 463. రూరల్ డివిజన్లో 509, నెల్లూరు టౌన్ డివిజన్లో 298 మొత్తం నెల్లూరు సర్కిల్లో 2942 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విద్యుత్ సంస్థలోని ప్రతి ఉద్యోగికీ వర్తిస్తుందన్నారు..ఈ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు షిఫ్ట్ ఆపరేటర్లు కూడా వర్తిస్తుందని, ఈ మోడల్ కూడా కండక్ట్ పరిధి లోనే ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఇష్టానుసారం పనిచేస్తే ఎలక్షన్ కమిషన్ తీవ్రమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. జి.ఐ.ఎస్. సర్వే పనులు ఇంకా పూర్తికాలేదని ఇప్పటికి 89శాతం పూర్తి కాగా మరి కొన్ని సెక్షన్స్ పూర్తిచేయలేదని వారు వెంటనే ఈ నెలాఖరులోపల పూర్తిచేయాలని తెలిపారు. 33 కె.వి. 11 కె.వి. లైన్లలో పెట్రోలింగ్ పూర్తి చేయాలని, సిబ్బంది సమస్యలను గుర్తించి ముందస్తుగా వాటిని పరిష్కరించాలని చేయాలన్నారు. డివిజన్ల పరిధిలో విద్యుత్ సరఫరాతో పాటు ఎటువంటి సమస్యలు తలెత్తిన తక్షణమే వాటి పరిష్కారంలో చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. వినియోగదాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ వృథాపై దృష్టి సారించి అరికట్టేందుకు చొరవ చూపాలన్నారు. రైతుల విద్యుత్ సమస్యలైనా ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు మార్చడం, కాలిపోయిన వాటిని మార్చడం వంటి వాటికి తక్షణం అధికారులు సిబ్బంది స్పందించాలన్నారు. . వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను స్వయంగా రెవెన్యూ కార్యాలయంలో కానీ డిజిటల్ పేమెంట్ (ఎస్‌పిడిసిఎల్, ఫోన్ పే, గూగుల్ ప్) ద్వారా కానీ చెల్లించాలని, ఉద్యోగస్తులకు అందజేయరాదన్నారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ శేషాద్రి బాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఇ

పోలీసుల తీరుపై 'ఇంటూరి' మండిపాటు

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని కనిగిరి రోడ్డులో వారం క్రితం ఆర్యవైశ్య వ్యాపారి శివరామకృష్ణ ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ దొంగలు మళ్లీ శుక్రవారం ఉదయం శివరామకృష్ణ ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దాడి చేయబోయారు. ఈలోపు చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో దొంగలు పరారయ్యారు. విషయం తెలుసుకున్న కందుకూరు టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నాయకులతో శివరామకృష్ణ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. మీ కుటుంబానికి నేను అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పోలీసులపై నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం సంఘటన జరిగితే దోషులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేక పోయారని నిలదీశారు. వారంలోపే మళ్లీ, అది కూడా పట్టపగలు దొంగలు రెచ్చిపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలతో ప్రజల్లో భయాం దోళనలు మరింత పెరిగాయని, దోషులను వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

భాదితులను పరామర్శిస్తున్న ఇంటూరి

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణం 20, 21వార్డులలో శంఖారావం కార్యక్రమం నిర్వహించిన కందుకూరు నియోజకవర్గ టిడిపి-బిజెపి-జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య చేశారు. వెంకయ్యనాయుడు హాస్పిటల్, కాళిదాసువారి వీధి ప్రాంతాలలో ఇంటింటికి తిరుగుతూ, భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు సౌజన్య మహిళా కార్యకర్తలు, నాయకులు పంచారు. కార్యక్రమంలో చెంచు నారాయణ, పాకల మల్లికార్జున, వలేటి వెంకటేశ్వర్లు, యోగేశ్వరరావు, చీదెళ్ళ పిచ్చయ్య, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఇంటూరి సౌజన్య

కొనుగోలు కేంద్రాలపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని రైతులు దళారుల వద్ద మోసపోకూడదనిశుక్రవారం మండల వ్యవసాయ అధికారి కిశోర్‌బాబు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో 7688 ఎకరాల వరి సాగు చేశారని తెలిపారు. కెఎన్‌ఎం-1638 ఆర్‌ఎన్‌ఆర్ 15048 వరి రకాలను మండలంలోని ఎక్కువ మొత్తంలో రైతులు సాగు చేశారని, ఫిబ్రవరి రెండవ వారం నుంచి వరి కోతలు మొదలు కాగా కెఎన్‌ఎం-1638 రకంరూ 22'500, ఆర్‌ఎన్‌ఆర్ -15048 రకం రూ.23500 చొప్పున ఒక పుట్టి (850కేజీ) ధాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పోలీస గ్రామాల్లో దళారులు పుట్టి ధాన్యాన్ని కెఎన్‌ఎం 1638 రకాన్ని రూ.1950 లెక్కన ఆర్‌ఎన్‌ఆర్-15048 రకాన్ని రూ.21500 లెక్కన నేరుగా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతులకు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకునే వీలుందని ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర అయినా పుట్టి ఒకటికి 850 కిలోల నిరతాకు రూ.18'725' 20 మొదటి గ్రేడ్ ఎ రకాలైన కొనుగోలు చేస్తామని తెలిపారు. అంతేగాక ధాన్యం తరలింపునకు సంచులు ఉచితంగా సరఫరా చేయడంతో పాటు ధాన్యం రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. మండలంలోని వరి సాగు చేసిన రైతులందరూ తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్ముకోవాలని తెలియజేశారు.

నైపుణ్యాలను వెలికి తీసేలా బోధన చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సామర్థ్యాలను, నైపుణ్యాలను వెలికి తీసే విధంగా బోధన ఉండాలని ఎంఇఒ-1 షేక్ మస్తాన్ వలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ ఎస్.బి. ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతుల విద్యార్థుల పఠన అభ్యసన నైపుణ్య సామర్థ్యాలను పరిశీలిస్తూ గణిత విషయంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్థాయి కంటే మిన్నగా ఉన్నాయని ఉపాధ్యాయులను అభినందించారు. ముఖ్యంగా పిల్లలతో డిక్షనరీలు విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు తీసుకుని వస్తూ ఉపాధ్యాయుల మార్గదర్శకంతో చదవాలని, లైబ్రరీ బుక్స్‌ను విద్యార్థులతో ప్రతిరోజు చదివిస్తూ అందులోని నీతిని వారు గ్రహించే విధంగా చేయాలన్నారు. ఏప్రిల్‌లో జరిగే ఎస్‌ఎ 2 పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున పాఠశాలలలో రాజకీయ నాయకులు ఎవరూ కూడా కనపడకుండా నియమావళి అమలు చేయాలని, మిగిలి ఉన్న నాడు-నేడు పనులను నాణ్యమైన వస్తువులను వాడుతూ నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

జెబిఎన్‌పి 'పల్లెపోరు'

ప్రజాశక్తి-కావలి : జై భారత్ నేషనల్ పార్టీ కావలి నియోజకవర్గం ఎంఎల్‌ఎ అభ్యర్థి నరేంద్రముప్పసాని ఆధ్వర్యంలో శుక్రవారం పల్లెపోరు బాట కార్యక్రమం చేపట్టారు. కావలి పట్టణం 16వ వార్డులోని పలు ప్రాంతాలలో పర్యటించారు. అక్కడ గ్రామంలోని ప్రతిఇంటికి జై భారత్ నేషనల్ పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ, గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఇంటి స్థలాల భూమి సమస్యలు ఉన్నాయని ప్రజలు తెలియజేశారు. అనంతరం అఖిల భారత వికలాంగుల హక్కుల సమితి కార్యదర్శి మండవ వెంకట్రావును నరేంద్ర ముప్పసాని కలిసి సమస్యలు తెలుసుకున్నారు. నరేంద్ర స్పందిస్తూ వికలాంగుల తరఫున పోరాటం చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా తోడుగా ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ తెలంగాణ యువజన అధ్యక్షుడు సిద్దు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ సందర్భంగా గండిపాలెం పిహెచ్‌సి వైద్య అధికారిణి డాక్టర్ శివ కల్యాణ ఉదయగిరిలో శుక్రవారం ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశాల ప్రకారం జిల్లా క్షయ కుష్ఠు ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ నేతృత్వంలో ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన చికిత్స గురించి అవగాహన కల్పించారు. టిబి 'వ్యాధి ఓ దారి - దేవం గెలవాలి' అంటూ కళ్ల పరీక్షతో క్షయ వ్యాధి నిర్ధారించుకొని, చేయించు కలుపుదాం క్షయ వ్యాధిని తరుముదాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివ కుమారి, చెన్నయ్య, అంకమ్మ, వెంకటేశ్వర్లు, మురళి తదితరులతో పాటు ఆరోగ్య శాఖ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : క్షయ వ్యాధిపై ప్రాథమిక స్థాయి నుంచి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కె ఖాదర్‌వలీ అన్నారు. కోవూరులోని వైజంక్షన్ అండ్ కె డిగ్రీ కళాశాల, గుమ్మళ్లదిబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని 20, 24వ వార్డులకు సంబంధించి వార్డు ఇన్‌ఛార్జి యువజన ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపికి చెందిన 200మందికి పైగా కార్యకర్తలు ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో వైసిపిలో చేరారు. గతంలో టిడిపి మద్దతుదారులు కూడా, ముఖ్యమంత్రి జగనన్న పాలనకు ఆకర్షితులై రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించేందుకు తమవంతుగా పనిచేస్తామని ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విధానాలపై ఆకర్షితులవుతున్నారని, అతి తక్కువ సమయంలో 4లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత మరెవరికీ లేదని, విద్యార్థులు యువత భవిష్యత్ కోసం కృషి చేస్తున్న జగనన్న పాలనపై అన్ని వర్గాలకు విశ్వాసం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి యుర్రియా, వేముల చెన్నకేశవులు నాయుడు, షాహుల్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ, అన్న పూర్ణ శ్రీనివాసరావు, పుల్లయ్య, కృష్ణ మల్లాద్రి, క్రిష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరవు మండలాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలోని 10 కరవు మండలాల్లో ఉపాధి హామీ పనులను ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుండి ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, నెల్లూరు కలెక్టర్ వారి ఛాంబర్ నుండి హరి నారాయణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రకటించిన వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు, కలిగిరి, కొండాపురం, కలువాయి, కొండాపురం, ఓలేటివారిపాలెం, లింగసముద్రం కరవు మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని దినాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ పది మండలాల్లో పనులను గుర్తించి పని దినాలు కల్పించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద పని ప్రదేశాల్లో వేసవి దృష్ట్యా కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వెంకట్రావు, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, ఆర్‌డబ్ల్యూస్ ఇఇ తిరుమల కుమార్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-పొదలకూరు : అవినీతి, అక్రమాలు, అరాచకాలకు కేరాఫ్‌గా మారిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు ఓటమి రుచి చూపిస్తారని టిడిపి పట్టణ అధ్యక్షులు బొద్దులూరి. మల్లికార్జున్ నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు కల్లూరు సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం సంగం రోడ్ కూడలి వద్ద టిడిపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని ప్రకటించడం తో స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. మదిరెడ్డి. నరసింహులు, దేవినేని శరత్, కండే.సురేష్, తల్లిక్.ప్రసాద్, బాల చంద్ర, ప్రసాద్.గిరి, సొరకొండ వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటరు సహాయ కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-కోవూరు

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎక్కువగా పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఓటరు సహాయక కేంద్రాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో సెక్టోరియల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. కోవూరు లోని జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లందరూ ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పక్కాగా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే చేపడుతున్న ట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముఖ్యంగా ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలున్న ప్రదేశంలో ఓటరు సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటరు తమ ఓటు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సహాయక కేంద్రం ద్వారా ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకుని ఆ పోలింగ్ కేంద్రానికి సులువుగా వెళ్లి ఓటు వేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కారణాల వల్ల ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా ఎండ, వడగాలుల నుంచి ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, టెంట్లు ఏర్పాటు చేయడం, తాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించడం జరిగిందన్నారు. ప్రతి కేంద్రంలో వికలాంగుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సెక్టోరియల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని ఏర్పాట్లను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేడు మాధవన్, ఇఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివా సులు, తహశీల్దార్ విజయశ్రీ, సెక్టోరియల్ అధికారి ఇందిరాపతి, కోవూరు సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తదితరులున్నారు.

ఇద్దరు వలంటీర్లు తొలగింపు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని చిలకలమర్రి, గోగులపల్లె గ్రామ సచివాలయాలకు చెందిన ఇద్దరు వలంటీర్లు ఎన్నికల నియమావళి ఉల్లంఘించడంతో శుక్రవారం తొలగించినట్లు ఎంపిడిఒ తాజ్‌మస్రూర్ తెలిపారు. చిలకలమర్రి గ్రామ సచివాలయ వలంటీర్ ఓ ప్రజా ప్రతినిధి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నందుకు, గోగులపల్లె గ్రామ సచివాలయం వలంటీర్ సోషల్ మీడియాలో ఓ పార్టీకి మద్దతుగా ప్రచారం చేసినందుకు తొలగించినట్లు కారణాలను తెలియజేశారు. ఇద్దరు వలంటీర్లను విచారించామన్నారు.

జలాశయంలో ట్రైనీ కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి

గండిపాలెం జలాశయాన్ని ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా ఆకస్మిక తనిఖీలు చేశారు. శుక్రవారం ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం జలాశయాన్ని ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా సందర్శించి జలాశయం నిర్మాణం నీటి నిలువ సామర్థ్యం కుడి ఎడమ కాలవల ఆయకట్టు పంట సాగు సామర్థ్యం వాటి స్థితిగతులను పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. కుడి ఎడమ కాలువల వల్ల నీటిపారుదల, క్రస్ట్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉదయగిరి చెరువు ట్యాంక్ బండ్ కట్ట నిర్మాణాన్ని పరిశీలించి వాటి పూర్తి వివరాలను

జలాశయం వద్ద పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా

ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు, డిఇ చంద్రమౌళిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఇలు వేణు, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అభిమానంతోనే టిడిపిలో చేరా..

- స్పష్టం చేసిన టిడిపి నేత అమరజీవి రెడ్డి

ప్రజాశక్తి-కావలి

మద్యానికి, డబ్బుకు అమ్ముడుపోయి టిడిపిలో చేరలేదని, అభిమానంతోనే చేరారని పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి తమ్ముడు అమరజీవి రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001 లో సిద్ధనకొండూరు ఎంపిటిసిగా పోటీ చేసి ఓడిపోయినట్లు, 2002లో అనంతపురం సర్పంచ్‌గా గెలుపొందినట్లు, 2007లో పెద్ద కొండూరు ఎంపిటిసిగా గెలుపొదానన్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ సమయంలో ప్రస్తుత ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వెంట ఉంటూ ఆయన కోసం పని చేశానన్నారు. 2011లో రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఎంఎల్‌సి పదవి కోసం పోటీ చేసినప్పుడు, తాను కాంగ్రెస్ పార్టీలో ఉండి కూడా అభిమానంతో ప్రతాప్‌రెడ్డికి ఓటు వేశానని తెలిపారు. ప్రతీచోట అభిమానంతో పనిచేశానని, డబ్బులు కోసం కాదని తెలియజేశారు. తాను అప్పుడు, ఇప్పుడు అనంతపురంకు చెందిన వాడినని తెలిపారు. 2019లో కావలి బిపిఎస్ సెంటర్‌లో జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా కండువా కప్పుకున్నానన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి వ్యక్తిత్వం, మంచితనం, నిరాడంబరత నచ్చి ఆయన విజయానికి కృషి చేయాలని ముందుకు వచ్చానని, ఆయన గెలుపునకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. 15 యేళ్లుగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి దగ్గర ఉన్నప్పుడు మంచివాడిని ఎలా అయ్యాను.. ఇప్పుడు మాత్రం చెడ్డ వాడిని ఎలా అయ్యాను.. అని ప్రశ్నించారు.

భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో నీటి వనరులను సక్రమంగా వినియోగించుకొని భూ గర్భ జలాలను కాపాడు కోవాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ముసునూరు ఎ.పి.టి.డబ్ల్యూ. గురుకుల బాలికల పాఠశాల ఆవరణంలో శుక్రవారం మండల న్యాయసేవా అధికారిక సంస్థ (లోక్ అదాలత్) ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవంపై అవగాహన సదస్సును నిర్వహించారు. నీటిని దుబారా చేయకుండా ప్రతీ ఇంటి ఆవరణంలో ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భ జలాలను పెంచుకోవాలన్నారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సలహాలు, సూచనలు పాటించి భూగర్భ జలాలను కాపాడుకోవాలని కోరారు. సాగు నీరు, తాగు నీటి కోసం కృషి చేసిన ప్రఖ్యాత ఇంజినీర్లు కె.ఎల్.రావు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ అర్థర్ కాటన్, శ్రీరామ్ కృష్ణయ్య లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని నీటి ఎద్దడి లేని భారతావనిని నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.సుజాత అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు నీటిని సక్రమంగా వినియోగించుకొని జల వరనరులను కాపాడుకోవాలని కోరారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ స్పందన, విధ్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణక్రాకలో 'విజయసంకల్పయాత్ర'

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని బ్రాహ్మణ క్రాకలో శుక్రవారం జరిగిన విజయ సంకల్ప యాత్ర విజయవంత మైంది. జమ్మలపాలెంలో జరిగిన జలదంకి మండలం ఉదయగిరి నియోజకవర్గం స్థాయిలో వైసిపి ఆత్మీయ సమావేశం నాయకులు కార్యకర్తలలో జోష్ నింపింది. జమ్మలపాలెం నుంచి బ్రాహ్మణక్రాక వరకు వైసిపి ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీలో వేలాదిమంది పాల్గొని విజయవంతం చేశారు. శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి అడ్రస్ సదన జమ్మలపాలెంలోని స్థానిక ఎస్‌విఆర్ కళ్యాణ మండపంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, జిల్లా పార్టీ అధ్యక్షులు ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలు విభేదాలు విడనాడి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వెంకటేశ్వర స్వామి సాక్షిగా చెబుతున్నా అభివృద్ధి పనులు చేసిన నాయకులకు రావాల్సిన బిల్లులన్నీ వచ్చేందుకు కృషి చేస్తానంటూ విజయసాయి రెడ్డి నాయకులకు హామీనిచ్చారు. బ్రాహ్మణక్రాకలో విజయసంకల్పయాత్ర జెడ్‌పిటిసి మేదరమెట్ల శివలీలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజయసాయిరెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డిపై బ్రాహ్మణక్రాక నాయకులు, ప్రజలు పూలవాన

ప్రజలకు అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి, మేకపాటి

కురిపిస్తూ ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బ్రాహ్మణక్రాక ప్రజలను ఉద్దేశించి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణక్రాకకు చెందిన వంటేరు వేణుగోపాల్ రెడ్డి ఆయన వద్ద 5వేల ఓట్లు ఉన్నాయంటూ టిడిపి నాయకులకు చెప్పి ఏడు కోట్ల రూపాయలకు అమ్ముడుపోయారని ఆరోపించారు. ఉదయగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కాకర్ల సురేష్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలు ఎప్పుడూ ప్రజలకు అందు బాటులో ఉండాలని చెబుతున్నారని, ఎన్‌ఆర్‌ఐ కాకర్ల సురేష్ ఇలా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, జిల్లా అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, యువ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డి, మండల పరిశీలకులు ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్‌పిటిసి మెదరమెట్ల శివ లీలమ్మ, మన్నెమాల సుకుమార్‌రెడ్డి, సొసైటీ అధ్య క్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, దేవరపల్లి రఘు రామిరెడ్డి, చేవూరు శ్రీనివాసన్ రెడ్డి, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళులు

ప్రజాశక్తి-ఉదయగిరి

మాజీ సర్పంచ్ షేక్.గాజుల జాఫర్ సాహెబ్ కుమార్తె అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం ఈ విషయం తెలుసుకున్న నెల్లూరు మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి ఆమె నివాసానికి వచ్చి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపారు. కొద్దిసేపు ఆయన కుటుంబ సభ్యులతో ఆ రోజుల్లో జాఫర్ సాహెబ్ మేకపాటి కుటుంబాన్ని ఆదరించారని గుర్తు చేసుకున్నారు. ఆయనవెంట జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, సీనియర్ వైసిపి నాయకులు, కుటుంబీకులున్నారు.

'పసుపులేటి' గూటికి కోటా వెంకట్

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని 28వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి వైసిపి పట్టణ సేవాదళ్ ఉప ప్రధాన కార్యదర్శి కోటా వెంకట్ వైసిపికి గుడ్ బై చెప్పారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ బరిలో ఉన్న పిఎస్‌ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ కండువా కప్పుకున్నారు. శుక్రవారం సాదరంగా ఆహ్వానించి పసుపులేటి సుధాకర్ "కోటా వెంకట్"కు కండువా కప్పారు. పసుపులేటి సుధాకర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, వారి విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

టిడిపిలో చేరికలు



ప్రజాశక్తి-అల్లూరు : అల్లూరు మండల టిడిపి కార్యాలయంలో దాదాపు మండలానికి చెందిన దాదాపు 250 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ సైకిల్ గుర్తుకే ఎందుకు ఓటెయ్యాలని గత మూడు రోజులు అందరూ కలిసి మాట్లాడుకున్న రీతిలో పార్టీని బలోపేతం చేసేందుకు ఇంటింటికి వెళ్లి 40రోజులో పదిసార్లు ఓటు వేయమని కోరాలని తెలిపారు. కావ్య కృష్ణారెడ్డి, రవిచంద్ర చేతుల మీదగా బండి అమరెడ్డికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు, అరగల రమణయ్య, కృష్ణచైతన్య, కావాలి జగన్, నజీర్ బాషా, కృష్ణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఎంపిడిఒ తాజ్ మస్రూర్ పేర్కొన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నియమావళి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు, వలంటీర్లు మొబైల్‌లోని ప్రజాప్రతినిధుల ఫొటోలను తొలగించాలని కమిటీ సభ్యులకు సూచించారు. గ్రామంలో తొలగించిని ప్రభుత్వ బోర్డుల్లో ప్రజా ప్రతినిధులు ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. ఎన్నికల నియమావళి పాటించకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రజాశక్తి-కోవూరు : పోలింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన అంశాల ప్రకారం పూర్తిస్థాయిలో శిక్షణ అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ అన్నారు. కోవూరులోని ఇఆర్ఒ కార్యాలయంలో శుక్రవారం పిఒలకు, ఎపిఒలకు శిక్షణ ఇచ్చే కోవూరు నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లకు పలు విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు. ఎఇఆర్ఒ, తహశీల్దార్ విజయశ్రీ, తదితరులున్నారు.

ప్రభుత్వ ఆయుష్ శిబిరం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆయుష్ శాఖ వారు ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిగా రీజనల్ డైరెక్టర్ గుంటూరు జోన్ డాక్టర్ జి.పద్మజాతి పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండ బిట్రగుంట బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆయుష్ విభాగం డాక్టర్లు పనిచేస్తున్నారని, భక్తులకు కావాల్సిన అన్ని రకాల వ్యాధులను పరీక్షించి వారికి కావాల్సిన మందులను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు కె చంద్రశేఖర్, ఎస్‌కె హలీ మౌలాలి, ఎన్.కృష్ణయ్య, సిబ్బంది కె.మాలాద్రి, టి.పవన్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కావలిలో..

ప్రజాశక్తి-కావలి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ రామ్‌సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి అన్నారు. ఐ.సి.డి.ఎస్. ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ పోషణ పక్షంలో భాగంగా శుక్రవారం పోషకాహారాల ఎగ్జిబిషన్ బుడంగుంట గేటు దగ్గర కచ్చేరిమిట్ట-1, 2 అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారించడాన్ని గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని మహిళలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, మహిళలు, గర్భిణులు, బాలింతలు, రక్తహీనత ఉన్న వారు వాటిని తీసుకోవాలన్నారు. పోషకలోపం ఉండకూడదనే ఉద్దేశంతో మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ వారు ఐరన్ పొలిక్, కాల్సియం, విటమిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు కె.శాంతి, జి.విజయలక్ష్మి, జి.ప్రసన్నకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : అంగన్‌వాడీ కేంద్రాలను సంపూర్ణ పోషక కేంద్రాలుగా ఉదయగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ పచ్చవ లావణ్య అభివర్ణించారు. వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం జరిగిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. చిన్నపిల్లల తల్లులు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. చిరుధాన్యాల వినియోగం ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. పౌష్టికాహార విలువలు చిరుధాన్యాల్లో హెచ్చుగా ఉంటాయన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచి మంచి పౌష్టికాహారం అందిస్తే ఎత్తుకు తగ్గ బరువుతో ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-2లో పౌష్టికాహార వారోత్సవాలను ఐసిడిసి సూపర్‌వైజర్ కె.కోటేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కోటేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే చిరుధాన్యాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం వంతుడుగా పుడతారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు గుడ్లు పాలు ఆకుకూరలు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జ్యోత్స్న, ఎంఎల్‌హెచ్‌పి జాన్, ఆశావర్కర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

In The Court of The VII th Additional District Judge : Gudur

I.A.No. 447/2022

O.S.No. 168/2014

Shaik Khaja Rahamthlla @ Rahamthulla - Petitoner / Plaintiff

Vs

1. Chitluri Venkateswarlu and 50 others -Respondents/Proposed Partys/Defendants

Notice

To,
R21. **Sarvepalli Surya Teja,** S/o **Srinivasa Rao,** Flat No. 3-B, Akshaya Gardens Apartment, 2nd Street, Sri Krishna Devaraya Nagar, Vanamthopu, Kodayapalem, Nellore.
R23. **Nagisetty China Madhava Rao,** S/o **Ramakrishnaiah,** R/o Qr. No. D2-34, Pinakini Nagar, Sullurpet, SPSR Nellore District.
R25. **Domanaboina China Masthanaiah,** S/o **Narasimhulu,** R/o D No 3/40 surasala street, Kaluvoy post & Mandal SPSR Nellore district
R30. **Bogadaboina China Masthanaiah,** S/o **Narasimhulu,** R/o D.No.24-1-298, Besthapalem, Mulapet, Nellore.
R31. **Gunti Bhagya Lakshmi,** W/o **Ashok Kumar,** R/o D.No.6-1-5, Ram Nagar, Tirupathi, Chittoor District.
R36. **Gorla Ramadevi,** W/o **Damanaboina China Masthanaiah,** D.No.3/40, Susarla Street, Kaluvoy Post and Mandal, SPSR Nellore District.
R38. **Vaddi Mallikarjuna,** S/o **Papaiah,** R/o Pangili Village, Rapur Mandal, SPSR Nellore District.
R40. **Pedapalem Madhu,** S/o **Manikyam,** R/o D.No.19-1-378, Near Mahalakshmi Temple, Kotamitta, Nellore City.
R41. **Patnam Krishnaveni,** W/o **Venkata Suresh,** R/o D.No.7-1-164, Wood House Pet, Stonehousepet, Nellore City.
R46. **Bala Babu Reddy,** S/o **Somireddy,** R/o Kondadibba, Mulapet, Nellore City.
R47. **Guntha Kondala Rao,** S/o **Venkateswara Rao,** R/o D.No.8-10-1/3, Benargie Pet, Near Satyanarayana Pet, Near Paschimgodavari District.
R48. **Bogadaboina Subbarayudu,** S/o **China Subbaiah,** R/o D.No.15-166, Subedarpet, Nellore City.
R49. **Potla Yasodamma,** S/o **Dasaradha Ramaiah,** D.No.25-2/2154, Jangalavari Street, Thummalagunta, Kondayapalem Gate Centre, Nellore City.
R50. **Narapasetty Kalpana,** W/o **Dinesh,** Flat No.202, Pavani Residency, Vedayapalem, Nellore City.

పై నెంబరు కేసులో పిటిషనరు/వాది మిమ్మల్ని ప్రపోజ్డ్ పార్టీగా చేర్చమని పై వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే01-04-2024ది** కి వాయిదా అయివున్నది. ఆ రోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.రమేష్ బాబు, బి.ఎస్‌సి., బి.ఎల్.,
పిటిషనరు / వాదితరపు అడ్వకేటు, నెల్లూరు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు తపాలా సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బందికి ఎపి సర్కిల్ అసిస్టెంట్ డైరెక్షన్ జి.సతీష్ ఆధ్వర్యంలో సమావేశాన్ని గురువారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సిబ్బంది అందరూ తపాలా సేవలను ప్రజలందరికీ చేరువ చేయాలని పిలుపునిచ్చారు. అందరూ తగిన అవగాహన కలిగి ఉండాలని, వాటిని ప్రజలలోకి విరివిగా తీసుకెళ్లాలని కోరారు. మారుతున్న కాలానుగుణంగా తపాలా సేవలు కూడా ప్రజలందరికీ అనేక పథకాలను అందిస్తుంది వాటన్నింటిని ఉపయోగపడేలా సిబ్బంది కృషి చేయాలని కోరారు. తపాల శాఖలో ప్రస్తుతం ఉన్న సేవల గురించి వివరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నెల్లూరు తపాల సూపరిండెంట్ ఎస్ఆర్‌కెహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి కూడా నిబద్ధతతో అందించే సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఎ.ఎస్.పి. పి.రాజగోపాల్ మాట్లాడుతూ తపాలా పథకాలను సిబ్బందికి వివరించారు. మార్చి మాసానికి ప్రతీ ఉద్యోగి తమతమ లక్ష్యాలను పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆత్మకూరు ఎఎస్‌పి అహ్మద్‌హుస్సేన్, ఎపిఎంలు, బిపిఒలు పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు సహకారం

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి జిల్లా సాధన కమిటీ తరపున నారా భువనేశ్వరికి, సగిలి డేవిడ్ కుటుంబానికి ధన్యవాదాలతో అభినందనలు తెలిపారు. శుక్రవారం కలసపాడు మండలం, హృదయ పేట గ్రామానికి విచ్చేసిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని ఉదయగిరి జిల్లాను ఏర్పాటు చేసి అన్నీ రంగాల్లో వెనుకబడిన ఈ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కడప జిల్లా, కలసపాడు మండల వాసులు మృతుని కుటుంబ సభ్యులు అభ్యర్థించారు. చంద్రబాబు అరెస్టు జీర్ణించుకోలేక మరణించిన సగిలి డేవిడ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆమె వచ్చిన సందర్భంగా వారు ఉదయగిరి జిల్లా ఆకాంక్షను భువనేశ్వరికి తెలియజేశారు. నైసర్గిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు, జీవన ప్రమాణాలు ప్రతిపాదిత ఉదయగిరి జిల్లాలో సారూప్యత, ఏకత ఉన్నాయని పేర్కొన్నారు. ఉదయగిరి, ఆత్మకూరు, కనిగిరి, బద్వేల్, గిద్దలూరు నియోజకవర్గాల్లోని 22 మండలాలను కలిపి జిల్లాగా చేయాలని వివరించారు. ఈ అభ్యర్థనపై భువనేశ్వరి ఆసక్తి కనపరిచి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తనవంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారు. కుటుంబ సభ్యుని కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న డేవిడ్ కుటుంబ సభ్యులు కుటుంబ శ్రేయస్సు కన్నా ప్రాంతం బాగు గురించి ఆలోచించి భువనేశ్వరిని కోరడాన్ని అందరిని ఆకర్షించి వారికి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఉదయగిరి జిల్లా సాధన కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

IN THE OF THE VI th ADDL. DISTRICT JUDGE CUM FAMILY COURT JUDGE, NELLORE

G.O.P.No. 103 / 2024

(In the matter of the Sole Guardianship and full custody of the minors by name **Vakati Sresta Reddy,** Son of **V.Naveen Reddy,** aged 3 years and R/o Penuballi Village, Buchireddypalem Mandal, SPSR Nellore District. Pin-524 305)

Vakati Naveen Reddy ... Petitioner

Vs

1. Panta Maheedhar Reddy @ Peddabbaiah
2. Panta Revathi ... Respondents

జనరల్ నోటీసు

పై నెంబరు కేసులో పిటిషనరు అయిన వాకాటి నవీన్ రెడ్డి గారి మైనరు కుమార్తె అయిన వాకాటి శ్రేష్ట రెడ్డి అను పాపకు విధ్య, ఆరోగ్యం పరమైన విషయములు చూచుకొనుటకు పాప తాతయ్య మరియు అమ్మమ్మ గార్ల కష్టడీ నుంచి తండ్రి అయిన పై పిటిషనరుకు ఇవ్వమని పై వారి కోర్టులో G.O.P.No.103/2024 పిటిషను దాఖలు చేయగా ఆక్షేపణలు నిమిత్తం **తే25-4-2024 దిన** పై కోర్టు వారు వాయిదా వేసియున్నారు. కావున ఎవ్వరికైనా ఏలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
సజ్జల శ్రీరాములు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్ తరపు న్యాయవాది, నెల్లూరు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం కొత్త మసీదు దగ్గర నివాసం ఉంటున్న షేక్.షబానా అనే నిరుపేద మహిళకు న్యాయవాది, సంయుక్త సేవా సంస్థ సభ్యులైన మల్లి సూర్య నారాయణ సహకారంతో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు బియ్యం కూరగాయలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాత మల్లి.సూర్యనారాయణ, సంస్థ సభ్యులు ఎమ్‌వివిఎన్ ప్రసాదరావు, ఎమ్ అజిత్‌బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావు, అజిత్ బాబులు మాట్లాడుతూ భర్త కొన్ని సంవత్సరాల క్రితం మరణించడం తో షబానా, వారి ఇద్దరు పిల్లలు తిండికి లేక ఇబ్బందులు పడుతున్నారని, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ద్వారా తెలుసుకున్న సంస్థ సభ్యులు అడ్వకేట్ మల్లి సూర్య నారాయణ ఆ కుటుంబానికి నిత్యావసరాలు అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మల్లి సూర్య నారాయణకు అభినందనలు తెలియజేశారు.

బకాయిలుంటే కుళాయి కనెక్షన్ తొలగించండి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం 2023-24 రెండవ అర్థ సంవత్సరం వరకు పన్నులపై విధించిన అపరాధ రుసుమును ఏక మొత్తంలో చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని, బకాయిలు ఉన్న ఆస్తులను జప్తు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, పేర్కొన్నారు. కమాన్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు, సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు, అమెనిటీస్ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరానికి తేది. 31-03-2024 లోపు ఏకమొత్తంలో చెల్లిస్తే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. పన్నులను నగర పాలక సంస్థ కార్యాలయంలోని పన్నుల వసూళ్ల కౌంటర్ తో పాటు నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పెషల్ కౌంటర్లలో చెల్లించవచ్చునని, అదేవిధంగా పన్నులను ఆన్‌లైన్ ద్వారా నెట్-బ్యాంకింగ్ ద్వారా కానీ, డెబిట్ / క్రెడిట్ కార్డు ల ద్వారా కానీ, యుపిఐ ద్వారా కానీ చెల్లించవచ్చని తెలిపారు. మొండి బకాయిదారులకు తగిన నోటీసులు జారీ చేసి వారి ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. భారీ మొత్తంలో ఉన్న బకాయిల వసూళ్లకు తానే ప్రత్యక్షంగా వచ్చి బకాయిదారుల నుంచి వసూళ్లు రాబడుతామని స్పష్టం చేశారు.అదేవిధంగా మంచినీటి కుళాయి, డ్రెయినేజ్ పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని అమెనిటీస్ కార్యదర్శులకు సూచించారు. కుళాయి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించి వారి మంచినీటి సరఫరా కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా నిరంతరం మంచినీటి సరఫరా నిర్వహణ నిమిత్తం పన్నులను బాధ్యతగా చెల్లించి ప్రజలంతా సహకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ ఎస్.ఇ సంపత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయం అడ్మిన్, అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు నారా భువనేశ్వరి రాక

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని పుంజులూరుపాడు, కురిచెర్లపాడు గ్రామాలకు నిజం గెలవాలని యాత్రలో భాగంగా శనివారం టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి రానునట్లు శుక్రవారం సోమిరెడ్డి కార్యాలయం ఒక ప్రకటన తెలిపింది. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై మృతి చెందిన అర్చి నారాయణరెడ్డి, సుబ్బ నాయుడు కుటుంబాలను ఆమె పరామర్శిస్తా రన్నారు. నారా భువనేశ్వరి పర్యటనలు విజయవంతం చేయాలని కోరారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం 725పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా, వాటిలో 584పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో 124పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ఎస్ 31ఎన్ బి78సిఆర్ 15ఉన్నాయని, అధిక బరువుతో ఉన్న 17 పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.230కాగా కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.228.12నమోదు కాగా, వేలంలో 17మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అపద్బాంధవ సేవా ట్రస్ట్ చైర్మన్ దామ మధుసూదన రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కావలి పట్టణంలోని ప్రముఖ హాస్పిటల్ ఆనంద్ మల్టీహాస్పిటల్ అధినేత డాక్టర్ కె.ఆనంద్ కుమార్ సహకారంతో దేవస్థానానికి వచ్చిన భక్తులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, నర్సులు నాగలక్ష్మీ, సువర్ణ భక్తులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు, వాణిజ్య కేంద్రాలు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు, తోపుడు బండ్లు, టీ, టిఫిన్ అంగళ్ళు, కేఫ్‌లు, బెంకాయల అంగళ్ళు, జ్యూస్ షాపులు తదితర వ్యాపారాల నిర్వాహకులు తమ ప్రాంగణంలో చెత్త బుట్టలను తప్పనిసరిగా ఉంచుకుని, కొనుగోలు దారులు వాటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ పేర్కొన్నారు. సంతపేట, హరనాథ పురం, బాలాజీ నగర్, రాంజీ నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ పారిశుద్ధ్య నిర్వహణ పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక దుకాణాల నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ వ్యాపార వాణిజ్య ప్రాంగణాలలో చెత్త బుట్టలను తప్పనిసరిగా వినియోగించాలని, వాటిపై నగర పాలక సంస్థ కేటాయించిన లోగో స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రంజాన్ మాసం ఉపవాస దీక్షలను దృష్టిలో ఉంచుకుని అన్ని మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను క్రమం తప్పకుండా చేపడుతున్నామన్నారు. 22వ డివిజన్ బ్యాంక్ కాలనీలో శానిటేషన్ సూపర్ వైజర్ శేషయ్య ఆధ్వర్యంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్సులను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యసురక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రజల ఆరోగ్యాలను కాపాడే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ (ఎఫ్ఏసి) ఎం. నారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలం లోని వరకవిపూడి గ్రామంలోని సచివాలయంలో జగనన్న ఆరోగ్యసురక్ష- 2 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నారాయ ణ రెడ్డి మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ సింధు మేఘన, వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారి, డాక్టర్లు పద్మలత, మౌనిక, గైనకాల జిస్ట్ మొత్తం 330 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి కోవూరు : దీర్ఘకాలిక రోగాలతో బాధలు పడుతున్న వారు ఈ వేసవిలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ తెలియజేశారు. కోవూరు పంచాయతీ పరిధిలోని సచివాలయం- 3 ప్రాంతంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నడక, వ్యాయామం లాంటి వాటిపై ప్రజలు దృష్టి పెట్టడం వల్ల కొన్ని రోగాలను నయం చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

యువత ప్రధాన పాత్ర పోషించాలి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ : రాష్ట్ర ప్రయోజనాలను దృష్టి లో పెట్టుకొని.. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకు నేందుకు యువతే ప్రధాన పాత్ర పోషించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. 20, 21 డివిజన్ల యువతతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల గెలుపునకు, ఓటమికైనా ప్రతి పోరాటానికి విద్యార్థులు, యువత పాత్ర చాలా కీలకమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మార్చాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రికావాల్సిన అవసరం ఉందన్నారు. 18 సంవత్సరాలు దాటిన యువత అంతా మీ ఓటు ఉందోలేదో చూసుకోవాలని, లేకపోతే కొత్త ఓటు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 ఏళ్లనుండి 25 ఏళ్లలోపు యువత, విద్యార్థులు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు.

మహిళలకు శిక్షణ కోర్సులు

ప్రజాశక్తి-వెంకటాచలం : మండలంలోని అనికేపల్లి గ్రామంలో శాలివాహన డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు హ్యాండ్ ఎమ్బ్రాయిడింగ్, పెయింటింగ్, డిజైనింగ్ వంటి కోర్సులలో శిక్షణ ఇస్తున్నారని శాలివాహన సాధికారత కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య తెలిపారు. శుక్రవారం శాలివాహన సాధికారత కమిటీ ఆధ్వర్యంలో అనికేపల్లిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు యడవల్లి మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టం బ్రహ్మయ్య, సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చల్లగిరి వరప్రసాద్, నాయకులు ఎమ్ కోటేశ్వరరావు, యస్ గోవిందయ్య, ఎంపీటీసీ సభ్యురాలు రేణిగ సుమతి పాల్గొన్నారు.

వైవభంగా గరుడ సేవ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం మోహిని ఉత్సవం గరుడ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కుబడిన తెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాలాద్రి, కార్యనిర్వాహణ అధికారి అరవ రాధాకృష్ణ, ధర్మకర్త మండలి సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో హెల్త్ అవేర్నెస్

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గౌరవరం గ్రామంలో స్పెషల్ క్యాంప్‌లో భాగంగా ఐదవ రోజు హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి వి ఎస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5వ రోజు గ్రామంలో వేసవిలో వచ్చే ఆరోగ్య సమస్యలను వాటి నివారణ చర్యలను ఫాంప్లెట్లో ప్రింట్ చేసి ఆ ఫాంప్లెట్లను గ్రామంలో పంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎ.కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులున్నారు.

దాడి చేయడం దుర్మార్గం

ప్రజాశక్తి-కందుకూరు : మాజీ ఐఎఎస్ అధికారి , పత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై వైసిపి రౌడీమూకలు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా పట్టించు కోకుండా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు వాలంటీర్ల ద్వారా తాయిలాలు పంపిణీ చేయించడాన్ని ప్రశ్నిస్తే తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు , నాయకులపై దాడి చేయడం అప్రజాస్వామి కమని మండిపడ్డారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు విజ్ఞప్తిచేశారు.

టిడిపిలో యువత చేరిక

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

నారాయణ విద్యా సంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో... నెల్లూరు నగరం 49వ డివిజన్‌కి చెందిన పలువురు యువత గోమతి నగర్ లోని నారాయణ క్యాంప్ కార్యాలయంలో...మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. పార్టీ కండువా కప్పి...సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు ఉంటుందని భరోసా కల్పించారు. టిడిపిలోనే యువతకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని చెప్పారు.

వివిఎస్‌యులో 'నాఓటు నాభవిష్యత్తు'

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని కాకుటూరు గ్రామంలో శుక్రవారం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో నా ఓటు...నా భవిష్యత్తు పై ఓటు పట్ల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరూ కొత్త ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఓటు ప్రాముఖ్యతను పునరుద్ఘాటించ డానికి జాతీయ ఓటరు అవగాహన పోటీ నా ఓటు నా భవిష్యత్తు ఒక ఓటు శక్తి కూడా అని అన్నారు. అనంతరం కాకుటూరులో వెయ్యి పైగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కే.విద్యా ప్రభాకర్, డాక్టర్ ఏ.ప్రవీణ్ కుమార్, డాక్టర్ యు.అనిల్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలోని స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కొంతమంది బిఎల్ఒలు స్వయంగా తాను ఫోన్ చేసిన లిఫ్ట్ చేసి సమాధానం చెప్పే పరిస్థితులు లేరన్నారు. ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలువురుపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు విధులపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ వెంకటకృష్ణ కుమారి, తహశీల్దార్ అరుణాదేవి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజారమేష్‌ప్రేమ్‌కుమార్

వెంకట రామిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-కలిగిరి : రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ సంఘం చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డిని జిల్లా హెల్త్ అసిస్టెంట్ నాయకులు కప్పా నాగరాజు కలిసి ఘనంగా సన్మానించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయించడం లోను, ఏపి హంస యూనియన్‌కి ప్రభుత్వ గుర్తింపు తీసుకొని రావడంలోనూ కాకర్ల సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా హంస అధ్యక్షులు చేజర్ల సుధాకర్, హంస నాయకులు హరి ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.